సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 14 । జులై । 2024



రాజన్నకు వీకెండ్ తాకిడి

వేములవాడ: రాజన్నను శనివారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు రాజన్నకు అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు నిర్వహించారు.



బెట్టింగ్ కోసం దొంగతనాలు

వేములవాడ: బెట్టింగ్ మాయలో పడి యువకులు దొంగతనాలకు అలవాటుపడ్డారు. ట్రాక్టర్‌ను చోరీ చేసి విక్రయించారు. పోలీసుల విచారణలో పట్టుబడి కటకటాలు లెక్కిస్తున్నారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సైకాలజిస్ట్ పున్నంచందర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న పున్నంచందర్

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన సైకాలజిస్ట్ కె.పున్నంచందర్ ఇన్‌స్పైర్‌రింగ్ అవార్డు అందుకున్నారు. మానసిక సమస్యలతో బాధపడేవారికి, మత్తు పదార్థాల నిరోధానికి, ఆత్మహత్యల నివారణకు పదిహేనేళ్లుగా పున్నంచందర్ చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు అందించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డు అందజేశారు.

'క్లాస్ రూమ్ కథలు' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కందేపి రాణిప్రసాద్, ప్రసాద్‌రావు

సిరిసిల్లటౌన్: బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణిప్రసాద్ రచించిన 'క్లాస్‌రూమ్ కథలు' పుస్తకాన్ని శనివారం సిరిసిల్లలో ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ తను చిన్నతనంలో ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా ఇంపోల్లు హైస్కూల్‌లో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తన రచనలను ఆదరిస్తున్న పాఠకులకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కందేపి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న మెదక్ ఎంపీ



కోడెమొక్కు చెల్లించుకుంటున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, కుటుంబ సభ్యులు

వేములవాడ: రాజన్నను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు శనివారం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి దర్శనానంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పర్యవేక్షకులు తిరుపతిరావు, శ్రీరాములు ఉన్నారు.

నేషనల్ ఆర్చరీ పోటీలకు శివకృష్ణ



శివకృష్ణను అభినందిస్తున్న గ్రామస్తులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన చిలుక శివకృష్ణ జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు సిల్వర్ మెడల్స్ సాధించాడు. శివకృష్ణను ఐఅండ్‌పీఆర్ ఏడీ మామిండ్ల దశరథం, జిల్లా క్రీడాశాఖ అధికారులు శ్రీకాంత్, రేణుక, కిరణ్, కోచ్ హరీశ్ అభినందించారు.

వివాదాస్పద ప్రహరీ కూల్చివేత



మినీస్టేడియం పక్కనే అనుమతి లేని ప్రహరీని కూల్చేసిన మున్సిపల్ సిబ్బంది

సిరిసిల్లటౌన్: స్థానిక మినీస్టేడియం పక్కనే ఓ వివాదాస్పద నిర్మాణంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. అనుమతుల్లేకుండానే 11 ఎకరాలకు ప్రహరీ నిర్మించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆరు నెలల క్రితం ఇలాగే నిర్మిస్తే అధికారులు కూల్చేశారు. ఇటీవల కొందరు ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రహరీని నిర్మించారన్న ఆరోపణలు రాజకీయంగా వివాదానికి దారితీసింది. ఈమేరకు 'సాక్షి'లో గురువారం 'ప్రీకాస్ట్ నిర్మాణం వివాదాస్పదం' శీర్షికన కథనం ప్రచురితమైంది. మున్సిపల్ కమిషనర్ లావణ్య స్పందించారు. టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ అన్సార్ ఆధ్వర్యంలో శనివారం ఆ వివాదాస్పద నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేశారు.

ఉద్యోగాల పేరిట దోపిడీ

- ఒక్కొక్కరి వద్ద రూ.2.50 లక్షలు వసూలు
- ముందుగా సగం డబ్బులు.. తరువాత సగం
- గ్లోబల్ ఫౌండేషన్ పేరిట నియామకపత్రాలు
- జిల్లాలో వందలాది మంది నిరుద్యోగులకు వల


GLOBAL FOUNDATION

ఇది కోనరావుపేటలోని జెడ్పీ హైస్కూల్‌లో కంప్యూటర్ ట్రైనర్‌గా బొంగురపు మంజులను నియమిస్తూ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ జూలై 12న జారీచేసిన నియామకపత్రం. అకాడమిక్ ఇయర్ 2024–2027 విద్యాంజలి 2.0 వాలంటీర్ ప్రోగ్రాం పేర్కొంటూ స్కూల్ ఎడ్యుకేషన్, లిటరసీ, భారత మంత్రిత్వశాఖ పేరిట లేఖను జారీచేశారు. నెలకు రూ.20వేలు జీతం ఇస్తామంటూ స్పష్టం చేశారు. ఈ లేఖపై రెఫరెన్స్ నంబరు, ఫోన్ నంబరు, నియమించిన వ్యక్తి పేరు, సర్వీస్‌రూల్స్ ఏవీ లేవు. ఇలా ఒక్క మంజులకే కాదు.. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా వందలాది మందికి నియామకపత్రాలు జారీ చేశారు.



కోనరావుపేటలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం

సిరిసిల్ల: జిల్లాలో గ్లోబల్‌ఫౌండేషన్ పేరిట నియామకపత్రాలు ఇస్తూ భారీ స్థాయిలో డబ్బులు వసూలుకు పాల్పడుతున్నారు. పాఠశాలల్లో కేంద్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తుందని పేర్కొంటూ గ్లోబల్ ఫౌండేషన్ పేరిట నియామకాలు చేపడుతున్నట్లు ప్రచారం చేసి ఒక్కొక్కరి నుంచి రూ.2.50లక్షల వరకు వసూళ్లకు పాల్పడ్డారు. స్కూళ్లలో ఉద్యోగాలు వస్తాయని నమ్మిన నిరుద్యోగులు భారీ సంఖ్యలో డబ్బులు ముట్టజెప్పినట్లు తెలిసింది.

ప్రచారం ఇలా..

జిల్లాలో హైస్కూల్ ఉన్న ఊరిని ఎంపిక చేసుకుని ఒక్కరికే ఉద్యోగావకాశం ఉందని ఎవరికీ చెప్పొద్దంటూ గుట్టుచప్పుడు కాకుండా ఈ వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఇటీవల మాజీలుగా మారిన ప్రజాప్రతినిధులను మధ్యవర్తులుగా ఉంచుతూ ముందుగా సగం డబ్బులు ఇస్తే నియామకపత్రాన్ని అందిస్తామంటూ నమ్మబలుకుతున్నారు. ఉద్యోగంలో చేరిన తరువాత మూడు నెలలకు మిగతా డబ్బులు చెల్లించాలని ఒప్పందం చేసుకుంటున్నారు. దీంతో నమ్మకం కలిగి బడిలో ఉద్యోగం వస్తుందన్న ఆశతో డబ్బులు ముట్టజెప్పుతున్నారు.

ఓ కౌన్సిలర్ ద్వారా పది మందికి..

సిరిసిల్ల పట్టణంలోని కార్మికవాడకు ప్రాతినిధ్యం వహిస్తున్న కౌన్సిలర్ ఒకరు ఏకంగా పది మందికి నియామకపత్రాలు జారీ చేయించారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే గ్లోబల్ ఫౌండేషన్ సంస్థకు చెందిన సంతోష్ అనే వ్యక్తికి డబ్బులు ముట్టజెప్పారు. సదరు కౌన్సిలర్ బాధ్యత తీసుకోవడంతో చాలా మంది నిరుద్యోగులు నమ్మి ఆయన ఇంటికి వెళ్లి తమకు నియామకపత్రాలు ఇప్పించండంటూ డబ్బులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు.

గతంలో అటెండర్ల పేరిట..

గతంలోనూ ఇలాగే ఓ సంస్థ అటెండర్లను స్కూళ్లలో నియమిస్తూ బోగస్ నియామకపత్రాలను జారీ చేసింది. మధ్యవర్తులను నమ్మి స్కూళ్లకు వెళ్లి మూడు నెలలపాటు పనిచేసిన వారికి ఎలాంటి జీతం రాకపోవడంతో వారంతా పనిమానేసి నియామకపత్రాలను అందించిన వ్యక్తుల వద్దకు వెళ్లి ఇచ్చిన డబ్బులు వాపస్ ఇవ్వాలని గొడవకు దిగారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 'సురక్ష' అనే ఔట్‌సోర్సింగ్ సంస్థ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేశారు. కానీ ఇలా నేరుగా గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ ద్వారా నియామకపత్రాలు ఇవ్వడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

ఆ పత్రాలతో మాకు సంబంధం లేదు



గ్లోబల్ ఫౌండేషన్ పేరిట హైస్కూళ్లలో నియమిస్తున్నట్లు పత్రాలు ఇస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఆ పత్రాలతో విద్యాశాఖకు ఎలాంటి సంబంధం లేదు. ప్రభుత్వ పరంగా మాకు ఆదేశాలు రాలేదు. ఈ అంశంపై ఎవరినీ స్కూళ్లలో చేర్చుకోవద్దని ప్రధానోపాధ్యాయులకు లేఖలు రాస్తాం. జిల్లా విద్యాధికారి అనుమతి లేకుండా ఎవరినీ స్కూళ్లలో నియమించరాదు. గ్లోబల్ ఫౌండేషన్ జారీ చేస్తున్న పత్రాలను ఎవరూ నమ్మవద్దు.

– రమేశ్‌కుమార్, జిల్లా విద్యాధికారి



పర్యావరణాన్ని కాపాడుకుందాం

వేములవాడ/సిరిసిల్లక్రైం: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. వనమహోత్సవంలో భాగంగా వేములవాడ పోలీస్‌స్టేషన్, జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలలో మొక్కలు నాటారు. ఏఎస్పీలు చంద్రయ్య, శేషాద్రినిరెడ్డి, డీఎస్పీ చంద్రశేఖరరెడ్డి, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్సైలు అంజయ్య, మారుతీ, ఆర్‌ఐలు మధుకర్, యాదగిరి, రమేశ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట



ఎల్లారెడ్డిపేటలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్, పక్కనే కేకే మహేందర్‌రెడ్డి

- జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కల్యాణలక్ష్మీ చెక్కుల ప్రదానం

సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి/గంభీరావుపేట/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్ల పంచాయతీరాజ్ అతిథి గృహంలో శనివారం పలువార్డులకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందించి మాట్లాడారు. ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకానికి రూ.10లక్షల వరకు పెంచి పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందేలా చూస్తామన్నారు. ఆగస్టులోపు రైతు రుణమాఫీ జరుగుతుందని స్పష్టం చేశారు. త్వరలోనే మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మ నాగేశ్వర్‌రావులతో నేతన్నల సమస్యల పరిష్కారానికి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు అందించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, కౌన్సిలర్ జాగీరు శైలు, మ్యాన ప్రసాద్, గడ్డం నర్సయ్య పాల్గొన్నారు.

పెద్దూరు వాసులకు పరిహారం అందించాలి

మెడికల్ కాలేజీ కోసం స్థలం కోల్పోయిన పెద్దూరు రైతులకు పరిహారం అందించాలని కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ కోరారు. ఈమేరకు విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. భూమి కోల్పోయిన రైతులకు వేయి గజాల స్థలం, నష్టపరిహారం హామీలు నేరవేర్చాలని కోరారు. జీల కిషన్, సురేంద్ర, బాలరాజు, పర్శరాములు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో 178 మందికి..

తంగళ్లపల్లిలో 176 మందికి కల్యాణలక్ష్మీ, ఆరుగురికి షాదీముబారక్ చెక్కులను ఆది శ్రీనివాస్ అందించారు. మండల స్పెషలాఫీసర్, ఆర్డీవో రమేశ్, సింగిల్‌విండో చైర్మన్లు బండి దేవదాస్, కోడూరి భాస్కర్, మాజీ జెడ్పీటీసీ పూర్మాని మంజుల, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నాయకులు పూర్మాణి రాంలింగారెడ్డి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఆర్‌ఐ మధు పాల్గొన్నారు.

గంభీరావుపేటలో 103 మందికి..

గంభీరావుపేటలో 103 మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేసి, నర్మాల ఎగువమానేరును గోదావరి జలాలతో నింపుతామన్నారు. తహసీల్దార్ భూపతి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హమీద్, మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, గంభీరావుపేట పట్టణశాఖ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో పూజలు

700 ఏళ్ల చరిత్ర గల గంభీరావుపేటలోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. 700 ఏళ్లుగా ఆరిపోని నంద దీపాన్ని పరిశీలించారు.

దున్నేవారికే రైతు భరోసా

దున్నేవారికే రైతు భరోసా అందుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ముస్తాబాద్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఎగువ మానేరు 12వ ప్యాకేజీ పనులతోపాటు 11వ ప్యాకేజీ పనులను కూడా ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ముస్తాబాద్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని నాయకులు వినతిపత్రాలు అందజేశారు. తహసీల్దార్ సురేశ్, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ సర్పంచులు తిరుపతి, రమణారెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీలు గుండెల్లి శ్రీనివాస్, బాలసాని శ్రీనివాస్, రాజేశం, మిర్యాల్‌కార్ శ్రీనివాస్, పెద్దిగారి శ్రీనివాస్, దీటి నర్సింలు పాల్గొన్నారు.

మండలాధ్యక్షునికి పరామర్శ

ముస్తాబాద్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఇటీవల బాల్‌రెడ్డికి శస్త్రచికిత్స జరుగగా నివాసానికి వెళ్లి పరామర్శించారు. పార్టీ, ప్రభుత్వపరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఎల్లారెడ్డిపేటలో 117 మందికి..

ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని లక్ష్మి–మల్లారెడ్డి కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 117 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మల్కపేట రిజార్వాయర్ తొమ్మిదో ప్యాకేజీ నిర్వాసితుల నష్టపరిహారం విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తహసీల్దార్ రామచంద్రం, డీటీ ఎలుసాని ప్రవీణ్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు గడ్డం నర్సయ్య, సాహెబ్, దొమ్మాటి నర్సయ్య, సద్ది లక్ష్మారెడ్డి, లింగంగౌడ్, గిరిధర్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నంది కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు.. ఆధునిక పోకడలు

అన్నదాతలకు శాస్త్ర పరిజ్ఞానం

- 'రైతునేస్తం' పేరిట సరికొత్త కార్యక్రమానికి రూపకల్పన
- ప్రతీ మంగళవారం సాగు–పాడి సమస్యలపై సమాధానాలు
- ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ శాస్త్రవేత్తలతో రైతుల భేటీ
- ప్రతీ రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాల ఇన్‌స్టాలేషన్
- ఇప్పటికే ప్రతీ వేదికకు టీ–ఫైబర్ కనెక్షన్

వ్యవసాయంలో నూతన మెలకువలు, ఆధునిక పోకడలను పరిచయం చేయడమే లక్ష్యంగా రైతుల కోసం ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమాన్ని వచ్చే మంగళవారం నుంచి ప్రారంభించనుంది. వాస్తవానికి మార్చిలోనే ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి అంకురార్పణ చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో కాస్త ఆలస్యమైంది. కోడ్ ముగిసిన దరిమిలా తిరిగి రైతునేస్తం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. తొలుత నియోజకవర్గానికి ఒక రైతు వేదికను యూనిట్‌గా తీసుకున్న అధికారులు అందులో వీడియోకాన్ఫరెన్స్ పరికరాలు ఏర్పాటు చేశారు. తర్వాత ప్రతీ మండల కేంద్రంలో ఉన్న రైతు వేదికలలో ఈ సదుపాయాన్ని విస్తరించే పనులు మొదలయ్యాయి. ఈనెల 15 నాటికి రాష్ట్రంలోని అన్ని మండలాల్లో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు ఏర్పాటయ్యేలా పనులు ఊపందుకున్నాయి. ఇందుకోసం రైతు వేదికలకు ఇప్పటికే టీ–ఫైబర్ కనెక్షన్లు ఇచ్చేశారు.

ఉమ్మడి జిల్లాలో రైతు వేదికలు	
కరీంనగర్ 75	జగిత్యాల 71
పెద్దపల్లి 54	రాజన్నసిరిసిల్ల 57





సాక్షిప్రతినిధి,కరీంనగర్:

రైతులకు వ్యవసాయంలో నవీన పద్ధతులు, ఆధునిక పనిముట్ల వినియోగం, సాగులో సమస్యలు, చీడ–పీడల నివారణ, నూతన వంగడాల వినియోగం, ఆధునిక పనిముట్ల పరిచయం, రైతుల విజయగాథలు తదితర అంశాలను శాస్త్రవేత్తలు రైతులకు వివరిస్తారు. వారి సందేహాలు నివృత్తి చేస్తారు. ఇందుకోసం ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ శాస్త్రవేత్తలు ప్రతీవారం రైతులతో చర్చించే అంశాలను ముందే ఎజెండా కింద రైతు వేదికలకు వ్యవసాయాధికారుల ద్వారా పంపుతారు. దీంతో వారి నుంచి రైతులకు ముందే సమాచారం చేరిపోతుంది. దాని ఆధారంగా ఏయే ప్రశ్నలు అడగాలో ముందే రైతులు సన్నద్ధమై వస్తారు. రైతులకు శాస్త్ర సాంకేతిక సాయం అందించి వారికి తోడ్పాటు అందించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. పట్టణాలు, నగరాలు మినహా సాగుభూమి ఉన్న ప్రతి మండలాల్లో 16 నుంచి రైతు నేస్తం అమలు కానుంది. మున్ముందు ఈ కార్యక్రమాన్ని యూట్యూబ్/జూమ్ వేదికలక్కు అనుసంధానం చేయనున్నారు.

సిద్ధంగా రైతు వేదికలు

ఈ కార్యక్రమ నిర్వహణకు కావాల్సిన వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను ఇన్‌స్టాలేషన్, టీ–ఫైబర్ ఇన్‌స్టాలేషన్ తదితరాలు దాదాపు పూర్తయ్యాయి. స్పీకర్లు, మౌత్‌లు చేరుకున్నాయి. కూర్చునేందుకు వీలుగా ప్రతీ రైతు వేదికల్లోనూ దాదాపు 125 వరకు కుర్చీలు అందుబాటులో ఉంటాయి. ఈ కార్యక్రమాన్ని ఇక ముందు మరింత సమర్థంగా వినియోగించుకోవాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ యోచన. రైతు భరోసాలో ప్రజాభిప్రాయసేకరణలో ఇప్పటికే రైతు వేదికలే కీలకంగా మారాయి. భవిష్యత్తులోనూ రైతు వేదికలు కేంద్రంగా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశాలు, వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఉత్తమ రైతులకు సన్మానాలు, అభినందనలు తెలియజేసేందుకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, ఇతర ముఖ్య అధికారులు తదితరులు 'రైతు నేస్తం'కార్యక్రమాన్నే వేదికగా మలచుకోనున్నారు. భవిష్యత్తులో రైతులకు ఇవి బహుళ ప్రయోజన కేంద్రాలుగా రూపాంతరం చెందనున్నాయని వ్యవసాయాధికారులు 'సాక్షి'కి తెలిపారు.



ప్రయాణప్రాంగణం.. బురదమయం

సిరిసిల్ల కొత్తబస్టాండ్ పరిసరాలు బురదమయంగా మారుతున్నాయి. చిరుజల్లులకే వరదనీరు నిలుస్తుండడంతోపాటు పరిసరాలు బురదమయం అవుతున్నాయి. గుంతలు ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా బస్టాండ్ పరిసరాల్లోని ఖాళీ ప్రదేశంలో పిచ్చిమొక్కలు పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి


శ్రీనాథ్(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రేమ విషయంలో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన తుడుము శ్రీనాథ్(24) శ్రీనాథ్ ఓ అమ్మాయిని ప్రేమించిన విషయంలో తలెత్తిన సంఘటనలతో మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఈనెల 10న ముస్తాబాద్ మండలం బందనకల్ శివారులో పురుగులమందు సేవించాడు. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనాథ్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామానికి మృతదేహం


సురేశ్ (ఫైల్)

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన వంగ సురేశ్ (35) గతనెల 23న ఇరాక్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మృతదేహం శనివారం స్వగ్రామం చేరుకుంది. సురేశ్‌కు భార్య వసంత, ఇద్దరు కుమారులున్నారు.

కొత్తపేటకు చెందిన మరో వ్యక్తి..

రాయికల్: మండలంలోని కొత్తపేటకు చెందిన తునికి శేఖర్ (27) మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. 20రోజుల క్రితం షార్జాలో శేఖర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడ ఉంటున్న జీడబ్ల్యూపీసీ అధ్యక్షుడు గుడెల్లి నర్సింహ, బొడ్డుపల్లి రాంకు సమాచారం ఇవ్వడంతో వారు స్పందించి శేఖర్ పనిచేస్తున్న కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని అశోక్‌నగర్‌కు చెందిన ఏదుల కిశోర్ (46) మోతె చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. అశోక్‌నగర్‌కు చెందిన కిశోర్ కొన్నేళ్లుగా కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. వ్యాపారం సరిగ్గా సాగక సుమారు రూ.5లక్షల మేర అప్పులయ్యాయి. అప్పులు తీర్చడం ఇబ్బందిగా మారడంతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. జగిత్యాల అర్బన్ మండలం మోతె శివారులోని చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రామగుండం: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం వెనకాల గుట్ట సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలోని పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.17,200 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, రెండు బైక్‌లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై రవిప్రసాద్, హెడ్ కానిస్టేబుళ్లు రాజేందర్, మహేందర్, కానిస్టేబుళ్లు ప్రకాశ్, అఖిల్, మల్లేశ్, రాజేందర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.







మురిసిన చదువులమ్మ

తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు, ఆప్తులతో సంబురపడిపోయిన తన పిల్లల్ని చూసి చదువులమ్మ తల్లి సరస్వతీదేవి మురిసిపోయింది. కొద్దిరోజులుగా కుటుంబాలకు దూరంగా వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న చిన్నారులు.. సెలవు రోజున అయినవారు రావడంతో ఎగిరి గంతేశారు.. అమ్మానాన్నలు తినిపించే గోరుముద్దలు పుష్టిగా తిన్నారు.. చాక్లెట్లు, ఐస్‌క్రీమ్స్ లాగేశారు.. అమ్మానాన్నలతో సెల్ఫీ దిగారు.. అక్కచెల్లెళ్లతో కబుర్లు చెప్పుకున్నారు.. అన్నదమ్ములతో మొబైళ్లలో గేమ్స్ ఆడుకున్నారు.. రోజంతా ఆనందంగా గడిపారు.. ఇంతటి పండుగ వాతావరణానికి వేదికైంది పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గురుకుల పాఠశాల. రెండో శనివారం సందర్భంగా విద్యార్థులను కలుసుకునేందుకు పాఠశాల యాజమాన్యం అవకాశం కల్పించడంతో వందల సంఖ్యలో తల్లిదండ్రులు తరలివచ్చి తమ పిల్లలతో ఇలా సరదాగా గడిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి







రిలే నిరాహారదీక్షకు అనుమతి ఇవ్వండి

- పోలీసులకు నేరెళ్ల బాధితుడి వినతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): నేరెళ్ల బాధితుల అంశం మరోమారు తెరపైకి వచ్చింది. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో నేరెళ్ల బాధితుడు కోల హరీష్ శనివారం వినతిపత్రం అందించి మాట్లాడారు. 2017లో అప్పటి ఎస్పీ, ఎస్సైలు నేరెళ్లకు చెందిన తనతోపాటు పెంట బానయ్య, పసుల ఈశ్వర్, బత్తుల మహేశ్, చెప్యాల బాలరాజు, గంధం గోపాల్‌లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్నారు. అప్పటి ప్రభుత్వం అధికారులకు వంతపాడిందని, ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటనపై తమకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 17వ తేదీ నుంచి నేరెళ్ల గ్రామంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈమేరకు తంగళ్లపల్లి పోలీసుల నుంచి అనుమతి కోసం వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.


తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట కోల హరీశ్

పోలీసు డాగ్ మృతి

- 8 ఏళ్లపాటు సేవలు
- నివాళి అర్పించిన ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసుశాఖలో ఎనిమిదేళ్లుగా డాగ్‌స్క్వాడ్‌లో విధుల్లో ఉన్న జాగిలం ట్యాంగో శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. జాగిలం మృతికి సంతాపంగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ పూలగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. జిల్లాలో 15 హత్య కేసులు, 84 దొంగతనాలలో మొత్తంగా 99 కేసులలో నిందితులను గుర్తించడంలో కీలకంగా వ్యవహరించినట్లు గుర్తు చేశారు. 2017లో ట్యాంగో తన హ్యాండ్లర్ లక్ష్మణ్‌తోపాటుగా ఎనిమిది నెలలపాటు ఐఐటీఏ మొయినాబాద్‌లో శిక్షణ పూర్తి చేసుకుంది. శిక్షణ అనంతరం జిల్లాలో సేవలందించింది. ఏఎస్పీ చంద్రయ్య, ఆర్‌ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్, హ్యాండ్లర్ లక్ష్మణ్, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

బెట్టింగ్ కోసం దొంగతనాలు

- పోలీసులకు చిక్కి కటకటాల పాలు
- ట్రాక్టర్ చోరీ కేసులో నలుగురి అరెస్ట్

వేములవాడ: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడిన వారు డబ్బుల కోసం దొంగతనాల బాటపట్టారు. డబ్బులు సరిపోక ట్రాక్టర్‌ను దొంగిలించిన ముగ్గురు యువకులతోపాటు దాన్ని కొనుగోలు చేసిన వ్యక్తిని రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను ఎస్పీ అఖిల్‌మహాజన్ శనివారం వేములవాడరూరల్ సీఐ కార్యాలయంలో వెల్లడించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వర్దవెళ్లికి చెందిన మందల సాయి, మందల వెంకటేశ్, మందల వంశీ ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు అలవాటుపడ్డారు. బెట్టింగ్‌కు డబ్బులు సరిపోకపోవడంతో బోయినపల్లి మండలం రాజన్నపేటకు చెందిన ఈడుగు కనకయ్య ట్రాక్టర్‌ను దొంగలించారు. ట్రాక్టర్‌కు ఉన్న కేజీవీల్స్‌ను తప్పించి కల్టివేటర్‌తో ఎత్తుకెళ్లారు. తన ట్రాక్టర్ దొంగతనానికి గురైనట్లు కనకయ్య ఈనెల 2న బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై పథ్వీధర్‌గౌడ్, కానిస్టేబుళ్లు కోటేశ్వర్, తిరుపతిలతో టీం ఏర్పాటు చేశారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, చిత్రంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐ శ్రీనివాస్

సీసీ కెమెరాల ఆధారంగా

దొంగతనానికి గురైన ట్రాక్టర్‌ను పట్టుకునేందుకు పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపట్టారు. బోయినపల్లి మండలం రాజన్నపేటలోని కనకయ్య ఇంటి నుంచి దేశాయిపల్లి, రత్నంపేట, గుండన్నపల్లి, కోరెం, వట్టింల, నూకలమర్రి, నర్సింగాపూర్(చందుర్తి మండలం), మల్యాల, లింగంపేట, రుద్రంగి మండలం మానాల మీదుగా భీంగల్, ఆర్మూర్ మీదుగా నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని మోడెంకు చేరుకున్నట్లు తెలుసుకున్నారు. మోడెంకు చెందిన గంజాయి పోశెట్టికి ట్రాక్టర్ విక్రయించినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

నలుగురి అరెస్టు

ట్రాక్టర్ దొంగతనానికి పాల్పడ్డ మందల సాయి, మందల వెంకటేశ్, మందల వంశీ, ట్రాక్టర్‌ను కొనుగోలు చేసిన గంజాయి పోశెట్టిలను శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4.50లక్షల విలువైన జాన్‌డీర్ ట్రాక్టర్, కల్టివేటర్, షిఫ్ట్ డిజైర్ కార్, ద్విచక్ర వాహనం, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

పోలీసులకు అభినందనలు

దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై పృథ్వీధర్‌గౌడ్, కానిస్టేబుళ్లు కోటేశ్వర్, తిరుపతిలను అభినందించి క్యాష్ రివార్డు అందజేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వృద్ధురాలు ఆత్మహత్య


సరోజ(ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన గిరిజన వృద్ధురాలు గుగులోత్ సరోజ(56) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు. సరోజ భర్త పీర్యా 1994లో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా.. అప్పటి నుంచి ముగ్గురు ఆడపిల్లలను పెంచి పోషించింది. ఇద్దరు కూతుళ్లకు వివాహం చేయగా.. రూ.15లక్షల వరకు అప్పు అయ్యింది. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతోపాటు అనారోగ్య సమస్యలు వచ్చాయి. ఈక్రమంలో మనోవేదనతో శుక్రవారం పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా.. శనివారం తుదిశ్వాస విడిచింది. చిన్నకూతురు సరితకి వివాహం కాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త పంచాయితీ


పంచాయతీ కార్యాలయం గేట్ ఎదుట వేసిన చెత్త

మేడిపల్లి: చెత్త తరలించే వాహనం రావడం లేదని పేర్కొంటూ జగిత్యాల జిల్లా భీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెంది వన్నెల శివానందం గ్రామ పంచాయతీ ఎదుట చెత్త పోసి నిరసన తెలిపాడు. శివానందం మూడురోజులుగా ఇంట్లో వివిధ పండుగలు చేస్తున్నాడు. ఆ చెత్తను తీసుకెళ్లేందుకు పంచాయతీ ట్రాక్టర్ పంపించాలని కార్యదర్శి నురుద్దీన్ అబిద్‌ను కోరగా.. ఆయన నిరాకరించాడు. దీంతో ఆగ్రహించిన శివానందం చెత్తను గ్రామ పంచాయతీ ఎదుట పడేసి నిరసన తెలిపాడు. గ్రామపెద్దలు గ్రామ పంచాయతీ వద్దకు చేరుకుని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో శివానందం శాంతించి పడేసిన చెత్తను తొలంగించాడు.


చోరీ కేసులో అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ సుబ్బారెడ్డి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): వ్యవసాయ పనులకు వినియోగించే రొటవేటర్ చోరీచేసిన కేసులో నిందితుడిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఓదెల మండలం కొలనూర్‌కు చెందిన తిరుపతిరెడ్డి సుల్తానాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో 10 ఎకరాలు, కొలనూర్ మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. సుద్దాలలోని తొగరి అశోక్‌కు చెందిన రొటోవేటర్‌ను తన వ్యవసాయ భూమి వద్ద ఉంచగా అది చోరీకి గురైంది. దీంతో శనివారం ఉదయం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో గట్టెపల్లి రోడ్డు వద్ద పోలీసులు సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు. అయితే, తిరుపతిరెడ్డి ట్రాక్టర్‌కు రొటోవేటర్ తగిలించుకొని సుల్తానాబాద్‌కు వస్తుండగా అనుమానం వచ్చి పోలీసులు విచారించారు. రొటోవేటర్ చోరీచేసిందని నిర్ధారణ కావడంతో తిరుపతిరెడ్డిని అరెస్టు చేశారు. కేసును కొద్దిగంటల్లోనే ఛేదించినఎస్సైలు శ్రావణ్‌కుమార్, నరేశ్, ఏఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ రమేశ్‌ను సీఐ అభినందించారు.

పల్లె సంస్కృతిని ఆవిష్కరించిన 'వరి గొలుసులు'

- 'గ్రెయిన్ చైన్స్' పేరిట ఆంగ్లంలోకి అనువదించిన కవి సవ్యసాచి
- నేడు ఫిల్మ్‌భవన్‌లో ఆవిష్కరణ



వరి గొలుసులు తెలుగు కవితా సంపుటి ముఖచిత్రం

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ యాస, భాష, సంస్కృతికి అద్దం పడుతూ కవితలు, కథనాలు రాసే కాలమిస్ట్ అన్నవరం దేవేందర్ రాసిన 'వరి గొలుసులు' కవిత సంపుటిని కవి, అనువాదకుడు సవ్యసాచి 'గ్రెయిన్ చైన్స్' పేరిట ఆంగ్లంలోకి అనువాదించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన సవ్యసాచి కరీంనగర్ భద్రాద్రి కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 10గంటలకు కరీంనగర్ ఫిల్మ్‌భవన్‌లో ప్రముఖ చలనచిత్ర దర్శకుడు, కవి రచయిత బి.నర్సింగరావు గ్రెయిన్ చైన్స్ కవిత సంపుటిని ఆవిష్కరించనున్నారు.

మూడవ ఆంగ్ల అనువాద సంపుటి



2001లో తొవ్వ కవితా సంపుటితో సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించిన నేను ఇప్పటి 'గ్రెయిన్ చైన్స్' వరకు 19 పుస్తకాలు రాసి ప్రచురించా. నేను రాసిన తొవ్వ, నడక, మంకమ్మతోట లేబర్ అడ్డా, దొడ్డు మల్లెచెట్టు కవితా సంపుటిల నుంచి కొన్ని కవితలను ఎంపిక చేసుకుని 'ఫ్యాం ల్యాండ్ ఫ్రాగ్రాన్స్' పేరున 2011లో నిజాం కళాశాల అధ్యాపకురాలు పి.జయలక్ష్మి చేసిన అనువాదం మొదటి ఆంగ్ల అనువాద సంపుటి. పొద్దుపొడుపు, పొక్కిలి వాకిళ్ల పులకరింత, ఇంటి దీపం, గవాయి, వరిగొలుసులు సంపుటిల నుంచి కొన్ని కవితలను ఎంపిక చేసుకుని 2022లో 'ది ఆన్ ఈల్డింగ్ స్కై' పేరున డాక్టర్ మంతెన దామోదరచారి ఆంగ్లంలోకి అనువదించారు. వరి గొలుసులు సంపుటిలోని అన్ని కవితలను గ్రెయిన్ చైన్స్ పేరుతో సవ్యసాచి ఆంగ్లంలోకి అనువాదం చేశారు.

– అన్నవరం దేవేందర్, కవి, రచయిత, కాలమిస్ట్, కరీంనగర్

తెలంగాణ భాషపై ఇష్టంతో..

కవిత్వం రాసే నాకు 'గ్రెయిన్ చైన్స్' మొదటి ఇంగ్లిష్ అనువాదమే. అన్నవరం రాస్తే తెలంగాణ భాష సొగసులు నచ్చడం, పల్లె భాషపై ఇష్టపడి వరి గొలుసులు కవితా సంపుటిని ఆంగ్లంలోకి అనువాదించా.

– సవ్యసాచి, కవి, అనువాదకుడు

కాలు కోల్పోయాడు.. పెన్షన్ వస్తలేదు

- పింఛన్ ఇప్పించాలని మంత్రి 'పొన్నం'కు వేడుకోలు


వెల్డింగ్ పని చేస్తున్న మధు

చిగురుమామిడి(హుస్నాబాద్): ఆ యువకుడు దివ్యాంగుడు.. కుటుంబానికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు.. కుడి కాలు లేకపోయినా ధైర్యం కోల్పోలేదు.. ఆత్మవిశ్వాసంతో వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. చిగురుమామిడి మండలంలోని ఒగులాపూర్‌కు చెందిన గట్టు మధుకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తన కుడి కాలు పోగొట్టుకున్నాడు. ఎలాంటి ఆస్తులు లేకపోవడంతో రూ.లక్ష అప్పు చేసి, కృత్రిమ కాలు అమర్చుకున్నాడు. జీవనోపాధి కోసం దారులు వెతికాడు. తన స్నేహితుడి సలహా మేరకు వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే, దివ్యాంగుల పెన్షన్ కోసం గత ప్రభుత్వం హయాంలో దరఖాస్తు చేసుకున్నాడు. కానీ, మంజూరవలేదు. కొద్దిపాటి అంగవైకల్యం ఉన్నవారు కూడా పింఛన్ పొందుతున్నారని, తనకు ఒక కాలు పూర్తిగా లేకున్నా అధికారులు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పందించి, పెన్షన్ ఇప్పిస్తే తన కుటుంబానికి మరింత ఆసరాగా ఉంటుందని కోరుతున్నాడు.

దొరికింది బొమ్మ తుపాకే..

సారంగాపూర్: బీర్‌పూర్ మండలకేంద్రంలో ఓ వ్యక్తి వద్ద లభించింది బొమ్మ తుపాకేనని పోలీసులు తేల్చారు. ఎస్సై కుమారస్వామి వివరాలు.. బీర్‌పూర్ మండలం కమ్మునూర్‌కు చెందిన తోట రాజ్‌కుమార్ జగిత్యాలలోని పోచమ్మవాడలో నివాసముంటాడు. బీర్‌పూర్ మండలకేంద్రంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో రాజ్‌కుమార్ వద్ద తుపాకీ ఉన్నట్లు గుర్తించారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా.. తాను అమెజాన్‌లో బొమ్మ తుపాకీని కొనుగోలు చేశానని, షార్ట్‌ఫిల్మ్‌లు, ఫొటోషూట్‌ల కోసమే తుపాకీని వినియోగిస్తున్నానని వెల్లడించాడు. దీంతో పోలీసులు రాజ్‌కుమార్‌ను విడిచిపెట్టారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపర్‌వైరు చోరీ

ఓదెల(పెద్దపల్లి): రూపునారాయణపేట గ్రామంలో 100 మంది రైతులకు చెందిన కరెంట్ మోటార్ల కాపర్‌వైర్‌ను శుక్రవారం రాత్రి దొంగలు చోరీ చేశారు. గ్రామశివారులోని మానేరు పరీవాహక చెక్‌డ్యామ్ ప్రాంతంలో రైతులకు సంబంధించిన విద్యుత్ మోటార్లు ధ్వంసం చేసిన దొంగలు రాగితీగ అపహరించారు. వరినాట్లు ముమ్మరంగా సాగుతున్న ఈతరుణంలో చోరీ జరగడంతో కొందరి వరినాట్లు నిలిచిపోయాయి.